తుపాకులు

భువనగిరి వెళ్ళే బస్సు నార్కట్‌పల్లిలో స్టార్ట్ అయి రోడ్డెక్కింది. కండక్టర్ వెనుక సీట్ల దగ్గరికెళ్ళి టికెట్స్ ఇస్తూ వస్తూ ముందు సీటు దగ్గర ఆగి-

"అమ్మా ఎక్కడికి పోవాలె, టికెట్ అన్నాడు" ఏదో ఆలోచిస్తూ కూర్చున్న నడివయసు స్త్రీని ఉద్దేశిస్తూ.

"ఏట్లోకి" అంటూ కండక్టర్‌ను ఎగాదిగా చూసింది. ఆమె ముఖం గుంజకపోయి వుంది. కాని చురుకైన చూపులు, పుల్లవిరుపు మాటలు.

"అయితే ఇంకో బస్సు ఎక్కు" అన్నాడు తనలో తాను నవ్వుకుంటూ. పొద్దున్నే ఎవరి ముఖంరా నాయనా చూసింది. రోజూ ఏదో వాదన, మరేదో గొడవ. ఈ కండక్టర్ నౌకరీ అంత పరేషాన్ నౌకరీ మరొకటి వుండదనుకుంట, ఎంత మంచిగా, ఎంత నిదానంగా వున్నా ఏదో రాద్ధాంతం.

"టికెట్ తీసుకో" ఈసారి మాటల్లో కాఠిన్యం ధ్వనించింది. చూపుల్లో తీవ్రత కదలాడింది.

తీసుకోకుంటే ఏం జేస్తవు అన్నట్లు చూసింది. కోపం, వ్యతిరేకత ఎండవాన కల్సివచ్చినట్లు వొచ్చాయి ఆమె చూపులో.

"టికెట్ తీసుకుంటవా, దింపెయ్యమంటావా" అన్నాడు చేసేది లేక తను తీసుకోబోయే ఆఖరు చర్యను ప్రకటిస్తూ.

"ఏది దింపెయ్యి చూస్త" గుడ్లురిమి, ముక్కు పుటాలను కదిలిస్తూ అంది. అప్పుడు బస్సులో సగానికి పైగా ఆమె వైపు చూస్తూ విషయం ఏమిటా అని ఆసక్తిగా వింటున్నారు.

కండక్టర్ బెల్ కొట్టాడు. బస్సు పక్కకు ఆగింది.

"దిగమ్మ" అంటూ కండక్టర్ ఎడమ చేత్తో బస్సు డోర్ తెరిచి, కుడిచేతిలో వున్న టికెట్ పంచ్ ప్లేయర్‌తో సైగ చేశాడు.

"నేను దిగను" అంటు ముందు సీటు వైపును గట్టిగ పట్టుకొని, తన మొండితనాన్ని ప్రదర్శించింది.

అందరూ ఆమె వైపు చూస్తూ ఎందుకట్ల అని ఆలోచిస్తూ ఉన్నారు.

ఆమె తీక్షణంగా బస్సు కిటికీలో నుండి బయటకు చూస్తూ వుంది. ఎన్ని రోజుల కింద తలంటుకుందో నెత్తంతా దుమ్ము పట్టి వుంది. కాని ఏదో పరేశానిలో పడి సరిగ తినకనేమో ముఖం గుంజుకపోయినట్టుంది. ఆమె

నుదురు భాగంలో ఏదో బాధ గూడుకట్టుకున్న గుర్తులు.

"చూడమ్మా నీవు టికెట్ అన్నా తీసుకో లేదా దిగనన్న దిగు" ఈసారి కండక్టర్ ఓపిగ్గానే అన్నాడు. ఈమెతో గట్టిగ మాట్లాడితే బెడుస్తుందని.

"దిగనంటే దిగను" అన్నది ఆమె.

"బస్సు ఇక్కడ ఆపేస్తా" అన్నాడు.

"అమ్మా టికెట్ తీసుకో" అన్నారెవరో వెనుకనుండి, బస్సు ఆగితే మళ్ళీ ఎపుడు స్టార్ట్ అవుద్దోనన్న అనుమానంతో.

"సర్కారు బస్సు టికెట్ తీసుకోకపోతే ఎట్టా" అన్నాడు మరో ప్రయాణికుడు.

"సర్కారు బస్సు కనుకనే టికెట్ తీసుకోను" అంది తాపీగ కిటికీలోనుండి బయటకు చూస్తూ.

"చెకింగ్ అయితే కండక్టర్ నౌకరు పోద్ది" మరో ప్రయాణికుడు.

"పోనీ" అంది.

"పిచ్చా, చాదస్తమా" అన్నాడో ప్రయాణికుడు.

"ఏంది పిచ్చి? నీకు పిచ్చి, నీ అమ్మకు పిచ్చి, నీ అయ్యకు పిచ్చి, మీ అందర్కీ పిచ్చి, పిచ్చి" అని ఎగపోస్తూ వుంది. ముందు పిచ్చా అన్న వ్యక్తి వైపు చూస్తూ నిజంగా పిచ్చి పట్టినట్లే అరిచింది. అది విన్న ఆ వ్యక్తి చేసేది లేక నోరు మూసుకున్నాడు.

ఆమె వెనుక సీటులో కూర్చున్న సత్యం.

"ఆమె వాదనను బట్టి ఏదో బాధలో వున్నట్టుంది" పక్కనే కూర్చున్న మూర్తితో అన్నాడు. వాళ్ళ ఇద్దరి వయసు దాదాపు ఒకటే. వాళ్ళిద్దరిలో సత్యం టీచర్, మూర్తి రెవెన్యూలో క్లర్క్. కళారూపాలను అభిమానిస్తూ, సాహిత్యాన్ని ఉపాసిస్తూ, అలాంటి అంశాలు ఎవరిలోనైనా కనిపిస్తే ప్రోత్సహిస్తూ వుంటారు. అందువల్ల ఎదుటి వ్యక్తి మాటల్లో ధ్వనిని బట్టి, చూపులను బట్టి అసలు విషయాన్ని ఇట్టే గ్రహిస్తారు సత్యం, మూర్తి ఇద్దరూ కూడా.

"ఆమెకు వలిగొండ టికెట్ ఇవ్వండి" అంటూ డబ్బులిచ్చాడు సత్యం. కండక్టర్ టికెట్ పంచ్ చేసి ఆయనకే ఇచ్చి బెల్ కొట్టాడు. బస్సు కదిలింది. అందులో కూర్చున్న జనం అంతా ఒక్కసారి గాలి పీల్చుకున్నారు.

కండక్టర్ గుడ్లురుమి చూస్తూ-

"ఇపుడు నీవు బస్సును అట్లనే ఆపితే ఇక్కన్నే బస్సుకు అగ్గి పెడుదును"

అంది.

తగులబెట్టవు మరి నీ తాత సొమ్మాయే" అన్నాడు కండక్టర్ యస్సార్ నింపుతూ కాస్త గట్టిగానే.

ఇప్పటి వరకు తగులబెట్టిన బస్సులన్నీ వాళ్ళ తాత సొమ్మనే తగులబెట్టింద్రా" గొంతు తీవ్రతను పెంచుతూ అంది.

"ఇగ చెప్పు" అన్నారెవరో వెనుక.

"ఆమెను రెచ్చగొట్టకండి" అన్నాడు సత్యం చుట్టూ చూస్తూ.

"బస్సు కాలినా మీ జీతాలైతే పిట్టలు మేయవుగా, కాలే బస్సులు కాలుతున్నా మీ జీతాలు పెరుగుతూనే వుండె" అంది.

"ఆ నీ ఇంట్లకెళ్ళి ఇస్తుంటివి" అన్నాడు కండక్టర్ రాసుకుంటూనే.

అది విని ఆమె పెద్దగా నవ్వింది.

అందరూ ఆమె వైపు చూస్తున్నారు.

"అయ్యల్లార ఇప్పుడు బస్సులో కూర్చున్నవాళ్ళందరూ ఇచ్చిన పైసలు వాళ్ళ వాళ్ళయి కావా" అంది.

"నీవైతే ఇవ్వలేదు కదా" అన్నాడు కండక్టర్ కాస్త వ్యంగ్యంగా ఆమె వైపు చూస్తూ.

"కండక్టర్ సాబ్, ఎవరిస్తే ఏమి, ఆమె టికెట్ పైసలు మీకొచ్చినయి కదా" అన్నాడు మూర్తి.

"ఏం సారు మీరు ఆమెను సపోర్టు చేస్తరు. ఆమె ఎట్లా మాట్లాడుతుంది" అంటూ వెనక్కి మళ్ళీ చూశాడు. మంటలో పొగ కల్సి వచ్చినట్టు ఆయన చూపుల్లో ఈసడింపు, కోపం.

కాస్త నిదానం ఆమె మాటలను పట్టించుకోకు అన్నట్టు సైగ చేశాడు సత్యం టీచర్.

ఏమోనండి అన్నట్టు పెదాలను బిగపట్టి వదులుతూ తదనుగుణంగా, కళ్ళను కదిలిస్తూ చూసి, చూపులను క్యాష్‌బ్యాగ్‌లో వేసుకున్నాడు.

ఆమె మాత్రం తనలో తానే గులుగుతూనే వుంది. ఆమె ఎదలో ఏ బాధ కలుగుతుందో.

"చూడడానికి మంచి ఆరోగ్యంగా వున్నా మనసు వుండొద్దా" అన్నాడు మూర్తి. ఆయన మనుషుల గూర్చి తెలుసుకోవడానికే పుస్తకాలు చదువుతాడు. చదివి మనుషుల గూర్చి ఆలోచిస్తాడు.

"అంతేనంటారా" అన్నాడు ఆ పెద్ద మనిషి.

"ఆమె ఏదో బాధలో వుంది. లేకపోతే అట్లా మాట్లాడదు" అన్నాడు సత్యం.

ఈలోపు బస్సు చిట్యాలలో ఆగింది. అక్కడ ఓ ఖద్దరు బట్టల రాజకీయ నాయకుడు బస్సెక్కాడు. బస్సు ఫుల్ అయి ఒక్క సీటు కూడా ఖాళీ లేదు.

కండక్టర్ లేచి తన సీటిచ్చాడాయనకు. అది చూసి ఆమె మళ్ళీ మొదలు పెట్టింది, దొంగను చూసినట్టు చూస్తూ-

"ఈ దేశంలో బతకాలంటే ఏషం మంచిదేసుకోవాలె" అంది.

ఖద్దరువాలా ఆమె వైపు చూసి, జేబులో నుండి డబ్బులు తీసి కండక్టర్‌కిస్తూ-

"రామన్నపేట" అన్నాడు. కండక్టర్ మిగతా చిల్లర తిరిగిచ్చాడు.

"పోరాటమపుడు ఆయుధాలు పట్టుకున్నోల్లు మంట గలిసిండ్రు. స్వరాజ్యం వచ్చినంక మాయ మాటలు జెప్పి పదవులను పంచుకొని ప్రజానాయకులం అని బతుకుతుండ్రు" అంది కిటికీలో నుండి బయటికి చూస్తూ, ఆ మాటల్లో వెటకారం, నిష్ఠూరం కదలాడింది.

ఏమిటి సంగతి అన్నట్టు చూశాడు ఖద్దర్‌వాలా కండక్టర్ వైపు. ఏమోసార్ అన్నట్టు పెదవి విరిచి, భుజాలను కదిలించాడు. అప్పుడు చెవిలో ఉన్న పెన్సిల్ కింద పడగా దాన్ని అందుకోవడానికి వంగి-

"బస్సెక్కినప్పటి నుండి ఒకటే గోల" అన్నాడు మెల్లగా.

అట్టనా అన్నట్టు చూశాడు ఖద్దర్‌వాలా.

"ఈమెను ఎక్కడో చూసినట్టుంది" అన్నాడు ఖద్దర్‌వాలా.

"ఎక్కడ చూసిండ్రో ఏమో మెదడు తినేస్తుంది." అన్నాడు కండక్టర్ ఆమెకు వినబడకుండా. ఉన్నట్టుంది ఆమె మౌనంగా ఏడుస్తోంది. బస్సంతా నిట్టూరుస్తూ, ఆమె వైపు చూస్తున్నారు. కండక్టర్ మాత్రం ఆమె వైపు చూడకుండా బస్సులోని జనాన్ని లెక్కపెట్టి, ఇచ్చిన టికెట్లను లెక్క చూసుకుంటూ అందరు టికెట్స్ తీసుకున్నట్టే కదా అని జనాన్ని మళ్ళీ లెక్క పెట్టి-

"ఎవరో టికెట్ తీసుకోలేదు" అంటూ చికాకుగా చూసి, ఓ పిల్ల తల్లిని ఉద్దేశించి

"అమ్మా ఆ పిల్లకు టికెట్ తీసుకున్నావా" అంటూ వెనుక సీటు వైపు నడుస్తూ అడిగాడు.

"గీమెకు టికెట్టెందుకు మూడేండ్లు కూడా లేవు" అంది తన బిడ్డను పొదివి

పట్టుకుంటూ.

"ఆరేండ్ల పిల్లను పట్టుకొని మూడేండ్లంటవు ఎట్టనమ్మా, తే, తియి, తియి పైసలు తియ్యి" అంటూ ఆమె దగ్గరే నిలుచున్నాడు.

"ఆ సంభాషణ విన్న పాప అవును, నాకు ఆరేండ్లు, ఒకటో తరగతి చదువుతున్నా" అంది కండక్టర్‌వైపు నిక్కి చూస్తూ.

"మంచి పాపవు, తియ్యమ్మా పైసలు తియ్యి" అంటూ ఆఫ్ టికెట్ ఇష్యూ చేసాడు. తల్లి పైసలు ఇవ్వక తప్పలేదు.

"దీన్ని చదివిస్తే ఉన్న మతి పోతుంది" అన్నది బిడ్డ వైపు కోపంగా చూస్తూ.

ఖద్దర్‌వాలా దుఃఖిస్తున్నామెను పరిశీలనగా చూస్తూ ఉన్నాడు. ఆమె చేతికి గోట్లున్నాయి. నుదుట బొట్టులేదు. పోరాటపు రోజులు గుర్తుచేసినందుకు ఒక్కసారె అతని మనసు పాతికేండ్ల వెనక్కు పరుగెత్తింది.

నిజాం గద్దె దిగాలని ప్రతి వ్యక్తి ఆయుధం అందుకొని పోరాడుతున్న రోజులు. పోరాటయోధులు గెరిల్లా దళాలుగా ఏర్పడి రజాకార్ల మీద మరుపు దాడి చేస్తూ ఉన్నారు. వలిగొండ నుండి మోత్కూర్ వైపు వెళ్ళే ఏరియా దళ నాయకుడు వలిగొండ బ్రిడ్జిని ఓ కంట కనిపెడుతూ వున్నాడు. రజాకార్లు గెరిల్లాల గాలింపు చర్యను ముమ్మరం చేశారు. దళ నాయకుల చిరునామాలు తెలుసుకొని, వాళ్ళ కుటుంబ సభ్యులను నానా హింసకు గురిచేస్తూ, ఎవరెవరు ఎక్కడున్నదీ చెప్పమని బాధించేవారు. ఆ రోజులు తలచుకుంటే గుండె చెరువౌతుంది. మౌనంగా ఏడుస్తున్న ఆమెకు సరిగ్గా అప్పుడే అడ్డంగా కన్నీటి తెరలు. ఓ రోజు పొయ్యిమీద ఎసరు పెట్టి తన ఆరు నెలల కొడుకుకు పాలిస్తూ, ఎన్నో నెలలనుండీ ఇంటికి రాని భర్తను తలుచుకుంటూ చాటలో బియ్యంలోని రాళ్ళు ఏరుతూ ఉంది ఓ స్త్రీ మధ్య మధ్య పాప పాలు తాగడం ఆపి, కాళ్ళు చేతులు ఆడిస్తూ బోసి నవ్వులతో తల్లి వైపు చూస్తున్నాడు. పాలధార ఆగిపోయి కన్నీటి చుక్కలు చేటలో రాలగానే ఉలిక్కిపడి, బాబు ముఖంలోకి చూసింది. ఒక్కసారె దుఃఖం మాయమైంది. అచ్చం తన భర్త నాగన్న ముఖమే. ఎప్పుడన్నా తీరిగ్గా పరాచికాలాడినపుడు ఆయన నవ్వు ఇట్లనే వుండేది. మరొకసారి కొడుకును తనివితీరా ముద్దాడింది. అప్పటి వరకు తన మనస్సులో వున్న తన భర్త తాలూకు ఎడబాటు జ్ఞాపకాలు ఆ ముద్దుతో కాసేపు కనుమరుగు అయినయి.

అంతలోనే ఎవరో వస్తున్న చప్పుడైంది. అది విని బిడ్డను గుండెలకదుముకొని లేచి నిలుచుంది.

"నిమ్మకాయలు" అన్నాడు ఓ వ్యక్తి దర్వాజా దగ్గర నిలుచొని. ఆయన భుజాన ఓ నిమ్మకాయలున్న గోనె సంచి, మరో భుజాన వేలాడుతున్న కందువలో ఒక వైపు సజ్జలు వున్నాయి. తన భర్త వెళ్ళేటప్పుడు చెప్పిన గుర్తులకు, ఈ వచ్చిన మనిషి పోలికలు కలిసాయి. అంతే కాదు, నిమ్మకాయలు అనే రహస్యపు సంకేత పదం గుర్తుకు వచ్చింది.

"అక్కా నిమ్మకాయలు కావాల్నా" అన్నాడు.

ఏదో ఉత్సాహం వంటి నిండా నిండుకోగా లోపలికి రమ్మని సైగ చేసింది.

"నీవే రా అక్కా దర్వాజా దాటలేను" అన్నాడు. బాబును రొంటిన వేసుకొని తానె వచ్చింది. తన భుజానికున్న మూటను దించుకొని చుట్టూ ఓ సారి చూసి వంగుతూ,

"ఏరుకో అక్కా నీ ఇష్టమొచ్చినవి ఏరుకో" అని-

"నాగన్న రేప్పొద్దున వేములకొండ జాతరకు వస్తుండు. జాతరల కుంకుమను కుప్పలు పోసుకొని అమ్ముకుంట కూర్చుండట. నీవు బాబును ఎత్తుకొని వచ్చి కూర్చోని ఏం మాట్లాడకు. కుంకుమను కొనుక్కోని పైసలిచ్చిరా. అప్పుడు మాత్రం నాగన్నకు బాబు కనబడేటట్టు ఎత్తుకో" అంటూ "అక్కడికెవరో వచ్చేది చూసి ఎన్నని ఏరుతవమ్మా కానియ్యి, కానియ్యి. ఇంకా ఊరంతా తిరగాలి" అన్నాడు. ఆ వచ్చిన వాడుతన దారిన తాను పోయాడు.

"అక్కా ఆకలైతుంది అన్నముందా" అన్నాడు. ఆమె అతని అంటుకపోయిన డొక్క వైపు చూసింది. అప్పుడు ఆమె గుండె తరుక్కుపోయింది.

"ఇంకా వండలేదు, ఎసరు కాగుతుంది, కాసేపు ఆగితే-" అంది బాధగా. బయట తిరిగే ఈయనే ఇట్లా వుంటే తన భర్త అని తలుచుకోగానే ఆమె కన్నీళ్ళు తన్నుకొచ్చాయి. కుక్కలు మొరిగిన చప్పుడు. ఎవరో వస్తున్నట్టు మూటలు సర్దుకొని లేస్తూ-

"అన్నం ఉడికిందాక వుండలేను" అని మూటలను భుజాన వేసుకొని "నిమ్మకాయలు" అంటూ లేచి అక్కడి నుండి కదిలాడు. అతను సందు మళ్ళేవరకు చూసి, బాబును ముద్దాడుతూ, న్మికాయలను వడిలో వేసి, రొండికి చెక్కుకొని బాబును రెండు చేతుల్లో ఎత్తుకొని ఉయ్యాల ఊపినట్టు ఊపుతూ మురిసింది. ఎసరు కాగి పొంగి పొయ్యి చల్లారుతున్న చప్పుడు.

ఇక రాత్రంతా కంటికి నిద్రే లేదు. మంచం మీద ముదుసలి మామ గుర్రు పెడుతూ ఉన్నాడు. పందిట్లో కుక్క పడుకొని మధ్య మధ్య గునుసుతూ

వుంది. రెండు మూడు సార్లు తలుపు చప్పుడైనట్టు అనిపిస్తే లేచి కూర్చుని, ఎవరూ రాలేదని నిట్టూర్చి బాబును పొట్టలోకి చేర్చుకుంటూ–

'ఒరే నా తండ్రి రేపు మీ నాన్న నిన్ను సూస్తారు. అచ్చం నాలాగే ఉన్నాడని మురిసిపోతాడుర కన్నా' అంటూ పసివాని ముఖంలోకి చూసింది. నిద్రలో ఆ నవ్వు ముఖాన్ని చూసి ఓసారి నిద్రభంగం కాకుండ ముద్దుపెట్టుకుంది.

తెల్లారి వేములకొండ జాతరలో కుంకుమ కుప్పలను వెతుకుతూ వుంది. ఆమె భుజాన పసివాడు. వాని తలకు కుచ్చుల కుల్ల. చేతులకు తెల్లని రాళ్ళు పొదిగిన నల్లని పూసలు కుచ్చి కట్టింది. నుదుట, బుగ్గ మీద నల్లని కాటుక పెట్టింది. కాళ్ళకు రాగి, వెండి కలిపి చేసిన కడియాలు తొడిగింది. మెడలో వెండి కత్తి, బిళ్ళను వేసింది. మొలకు నల్లని దారం కట్టింది.

జాతరంతా తిరిగి చూసింది. అక్కడక్కడా కుంకుమ కుప్పలున్నా ఆయన లేడు. కళ్ళు దివిటీలై వెతుకుతున్నాయి. మనసు వేయి కళ్ళు చేసుకొని వెతుకుతూ వుంది. ఆయన మాత్రం కనబడలేదు.

'కాసేపైనాక వస్తుండొచ్చు, ఈలోపు గాజులు వేయించుకుందాం' అని గాజుల దుకాణం ముందు కూర్చుంది. గాజులను చూస్తూ 'ఆయనకు ఏ రంగు గాజులైతే ఇష్టమో ఎన్నడు చెప్పలేదు. ఏనాడైనా తీరిగ్గా ఇంటి పట్టున ఉంటేకదా' అనుకొని

"ఆ ఎర్ర గాజులు తొడుగు" అని గాజు మలారం ముందు కూర్చుంది. భుజం మీద కొడుకు, ఆని నోట్లో బొటిమన వేలు. దుకాణం వాడు గాజులను చూపిస్తూ ధర చెప్పాడు. ఆమె సరే అంది.

"పాత గాజులు తీసియ్యమంటావా" అన్నాడు. "అమ్మో వద్దు వాటిని అట్టనే వుంచి కొత్తయి తొడుగు" అంటూ గాజులు ఎక్కియ్యడానికి చేయి ఇచ్చింది. అతను "సరే" అని గాజులను జత జతగా కలిపి ఎక్కిస్తుంటే అవి చిట్లిపోతున్నాయి. అతనూ ముఖం చిట్లించుకుంటున్నాడు.

చంకలోని బాబు ముందుకు మళ్ళి రంగు రంగుల గాజుల వైపు చూస్తూ హు కొడుతున్నాడు. అప్పుడప్పుడు వంగి గాజులు అందుకోవాలని ప్రయత్నం చేస్తూ ఉన్నాడు.

"అమ్మా అట్టా బిగపట్టినట్టు రెక్క పెడితే గాజులెక్కవు" అన్నాడు తన పళ్ళు బిగుస్తూ చికాకుగా గాజులవాడు.

ఆమె కదిలి కూర్చుంటూ ఓసారి కుంకుమ కుప్పలవైపు చూసింది. ఆయన

రాలేదు. కానీ ఆయన గురించి పక్క దుకాణంలో అనుకుంటున్న మాటలు చెవిలో పడగానే భూమి గిర్రున తిరిగినట్టు అనిపించింది. కళ్ళు మూతలు పడ్డాయి. వేములకొండ మీది దేవుడు గుట్ట మీది నుండి జారిపడ్డట్టు అనిపించింది. గుట్టమీది నుండి కింద జారిపడ్డట్టు అనిపించింది. గుట్ట మీది గుండం అంతా ఎర్రగై మనిషి రక్తంలా మారినట్టు అనిపించింది. సంకలోని బాబు జారి ఏడుస్తూ వున్నాడు. ఆ ఏడుపు విని ఈ లోకంలోకి వస్తూ బాబును ఎదమీదికి ఎగేసుకుంటూ లేస్తూ "నాకు గాజులొద్దు అన్నా" అంది. అప్పుడామె గొంతు పూడకపోయినట్టు పలికింది. కళ్ళనిండా నీళ్ళు. గుండె నిండా దుఃఖం.

ఆమె అక్కడి నుండి కదిలి వచ్చిన దారి వైపు నడుస్తూ వుంటే జనం ఆరోజు తెల్లవారు జామున వలిగొండ దగ్గర రజాకార్లు కుంకుమ సంచులతో వస్తున్న నాగన్నను తుపాకీతో కాల్చి చంపిండ్రు అని అనుకుంటున్నది విని శోకమూర్తిగా మారింది.

రామన్నపేటలో బస్సు ఆగింది. ఖద్దరువాలా దిగిపోయాడు.

ఇద్దరు పోలీసులు బస్సెక్కారు. చేతుల్లో తుపాకులు. కండక్టర్ టికెట్ అడగలేదు. వాళ్ళేదో కాగితాన్ని చూపించారు. అది చూసి మళ్ళీ ఆమె మాట్లాడసాగింది. ఈసారి ఆమె ముఖ కవళికలు మారిపోయాయి. దుఃఖం పోయి గొంతులో రోషం చోటు చేసికొంది. తుపాకుల వైపు, వాటిని పట్టుకొని కూర్చున్న పోలీసుల వైపు తీక్షణంగా చూస్తూ వుంది. అప్పుడామె కళ్ళు ఎరుపు ఎక్కుతూ వున్నాయి. గుండెలో నుండి గతం తన్నుకొస్తూ వుంది.

'ముందు ఉద్యోగుల జీతాలు పెరగాలని సమ్మె చేసిండ్రా?

పెరగలేదు.

ఈ ప్రభుత్వాన్ని పడగొడదాం అన్నారా?

ఉద్యోగులంతా ఏకమై ఊరేగింపు తిసి, సభలు చేసి, ధర్నాలు చేసిండ్రా?

ప్రభుత్వం పడిపోయిందా? కాకపోతే నడిపేవాళ్ళు మారిండ్రు.

విద్యార్థులను రెచ్చగొట్టిండ్రా? స్కూల్స్, కాలేజీలను మూయించిండ్రా? ప్రభుత్వ ఆస్తులకు నిప్పు బెట్టిండ్రా. బస్సులను తగులబెట్టిండ్రా? టెలిఫోన్ తీగలను తెంపించిండ్రా? చివరికి ఏరే రాష్ట్రం కావాలన్నరా? అవును ఆ మాటలతో నాయకులు మర్రి వృక్షమంత ఎదిగారు. విద్యార్థి లోకం జూలు

విదిలించి మళ్ళీ గర్జించారు. ఊళ్ళకు ఊళ్ళు కదిలొచ్చాయి. పట్టణాలన్నీ ఉరుకులు, పరుగులు. విద్యుచ్ఛక్తికి అంతరాయం, హైద్రాబాద్ నగరం అంతా చిమ్మచీకటైపోయింది. రాత్రికి రాత్రి భారత ప్రధాని నగరానికొచ్చి పరిస్థితులు సమీక్షించి వెళ్ళినా పరిస్థితులు యధాతథం. అల్లకల్లోలం.

రైళ్ళను ఆపేశారు. రాష్ట్రాన్నంతా అతలాకుతలం చేశారు. జైళ్ళన్నీ ప్రత్యేక తెలంగాణా పోరాట కార్యకర్తలతో నిండిపోయాయి.

రాజకీయ నాయకులు, విద్యార్థి నాయకులు కలిసి పోరాటాన్ని మరింత ఉధృతం చేశారు.

ఊరేగింపులు హద్దులు దాటాయి. నినాదాలు ఆకాశాన్ని అంటాయి. అంతా అల్లకల్లోలం. ఎన్నో కుటుంబాలకు కంటికి నిద్రలేదు. నిన్నటి కలిసి తిరిగిన వాళ్ళు ఇవాళ తప్పక తిరగసాగారు. మాట్లాడకూడనంత మౌనం మనిషి మనిషి మధ్య పెరిగిపోయి అలజడి హద్దులు దాటింది. లూటీలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం స్తంభించిపోయింది. అయినా తెలంగాణా నాయకుని చేతికర్ర కదిలి కదిలి జనాన్ని కదిలిస్తూనే వుంది.

ప్రభుత్వం ప్రజల మధ్య పోరు హెచ్చరిల్లిపోయింది. అది చూసిన ప్రభుత్వం తుపాకులను ఎక్కుపెట్టింది. ఎన్ని చోట్ల లాఠీ చార్జీలు! టియర్ గ్యాసులు, మరెన్నో చోట్ల ఫైరింగులు–

ఎందరు నేలికొరిగారు–'

సరిగ్గా అప్పుడే అమ్మా అని? అరిచినపుడు పేగు కదలింది. ఆమె పెదవులు అదిరినయి. అప్పటివరకు మౌనంగా ఆలోచిస్తున్న ఆమె గట్టిగా అరిచి ఏడవసాగింది. పక్కనున్న ఆడవాళ్ళు ఆమె భుజాల మీద చేతులేసి ఓదార్చి కూర్చోబెట్టారు. అయినా ఆమె తలెత్తి–

"అగో పోలీసు! అయే తుపాకులు నా ఒక్కగానొక్క కొడుకును నిలువునా కాల్చేసిరి. నా ఒక్క కొడుకే కాదు, ఎందరి కొడుకులనో పొట్టన బెట్టుకుండ్రు. మా శోకం వూకేపోదు, తప్పక తగులుతది.

బస్సంతా కలియజూసి, మరి తెలంగాణా వచ్చిందా? మనిషి, మనిష మధ్య పరాయితనం పెరిగింది కదా, ఇంత జరిగినా అంతా మరిచిపోయి మల్ల వాళ్ళకే ఓటేసి గెలిపిస్తుండ్రా? ఇప్పుడు వాళ్ళు మంత్రులు! ముఖ్యమంత్రులు"

బస్సు వలిగొండ బ్రిడ్జి మీద నుండి పోతూ వుంది. బ్రిడ్జ్ దాటగానే

వేములకొండకు వెళ్ళే రోడ్డు కనపడింది.

"బస్సాపు" అని అరిచింది సీటు నుండి లేస్తూ ఆమె.

ఇంత విని గూడ కండక్టర్ బెల్ కొట్టలేదు.

డ్రైవర్ గేరు మార్చి, బస్సు ఆపి ఆ తరువాత వెనక్కు మళ్ళి ఆ దిగుతున్న ఆమె వైపు చూశాడు.

ఆమె దిగుతూ పోలీసుల వైపూ, తుపాకుల వైపూ చూస్తూ తనలో తానే ఏదో గునుగుతూనే దిగింది. మూర్తి లేచి వెళ్ళి ఆమె దిగేవరకూ మెట్టు మీద నిలుచున్నాడు.

"ఏంది సార్! మీరట్టనే" కండక్టర్.

కండక్టర్ వైపు చూస్తూ-

"ఆమె పిచ్చిదానిలాగా కనిపిస్తుంది కదా నీకు" అన్నాడు మూర్తి కండక్టర్ పక్కన ఆగి.

"అయ్యా ఆమె గురించి నాకెరుకే. ఆమె ఎన్నోసార్లు ఇక్కడ దిగడం చూశాను. బ్రిడ్జ్ దగ్గరికి రాగానే శోకమూర్తిగ మారిపోతుంది" అన్నాడు డ్రైవర్.

"ఆమెకు మిగిలింది అదే కదా" అన్నాడు మూర్తి డ్రైవర్ వైపు చూస్తూ.

"గతం తెలుసుకోక గుర్రుమంటుండు పిల్లడు" అన్నాడు సత్యం తన సహజధోరణిలో. బస్సు కదిలి పరుగందుకొంది.

మూర్తి కండక్టర్‌నుద్దేశిస్తూ-

"క్లాసు పుస్తకాలు చదివితివి, పాసై ఉద్యోగం కొట్టేస్తివి. ఇంకా వేరే పుస్తకాలు కూడా చదువు. లోకం సంగతి తెలుస్తది"

కండక్టర్ నోట్లను పేర్చుకుంటూ విన్నాడే కానీ మాట్లాడలేదు.

"గోర్కి రాసిన 'అమ్మ' అని ఓ పుస్తకం ఉంది, చదువు. అది చదివితే ఇప్పుడు పోయినామె పిచ్చిదో, మంచిదో తెలుస్తుంది" అంటూ వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

ఆమె పిచ్చి ఈయనకొచ్చినట్టుంది అని అనుకున్నాడే గాని బయటకు అనలేకపోయాడు కండక్టర్.

వలిగొండ వచ్చింది. బస్సు ఆగింది.

కథా నిలయం
54.79
1998
శ్రీకాకుళం